## క్లుప్తంగా

### పది లీటర్ల నాటుసారా స్వాధీనం

బెజ్జూర్: నాటుసారాకు వాడే బెల్లం, పటిక స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు తయారీదారులను అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్, ఆసిఫాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు మండలంలోని లంబాడిగూడలో కిరాణా షాపులో గురువారం దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ కోసం వాడే 350 కిలోల బెల్లం, 30 కిలోల పటికతోపాటు 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా తయారీ చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి.లోభానంద్, ఐ.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### పాఠశాలలో వేసవి శిక్షణశిబిరాలు



విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ చాపిడి కుమార్

రెబ్బెన: మండలంలోని నవేగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం కరాటే, డ్యాన్స్, క్రాఫ్ట్ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కరాటే మాస్టర్ చాపిడి కుమార్ అన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో శిక్షణ పొందాలని సూచించారు. ప్రతీరోజు ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు ఉచితంగా నిర్వహించే కరాటే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటేపై పట్టు సాధించాలని కోరారు. ఈనెల 15 వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నట్లు హెచ్ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

### చదువుతోనే అభివృద్ధి



మహిళలకు అక్షరాలు నేర్పుతున్న రమేశ్

కౌటాల: చదువుతోనే జీవితంలో అభివృద్ధి సాధ్యమని అక్షర చైతన్య యాత్ర నిర్వాహకుడు సుందిళ్ల రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని గిన్నెలహెట్టి గ్రామంలో అక్షర చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా అందరూ చదవాలి– అందరూ ఎదగాలని నిరక్షరాస్యులైన వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు విజ్ఞానవంతులైనప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాల్య వివాహాలను చేయొద్దన్నారు. ఓటు హక్కును అమ్ముకోవద్దన్నారు. మాజీ సర్పంచ్ నిహారిక, పంచాయతీ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### ఒకరి రిమాండ్



శంకర్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న అధికారులు

బెజ్జూర్: పోడు వ్యవసాయం కేసులో పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన మెస్రం శంకర్‌ను అరెస్టు చేసి గురువారం 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎవరైన చెట్లు నరికి పోడు వ్యవసాయం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వాంకిడి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని ఖమాన శివారులో ఏఎస్సై పోశెట్టి ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించగా రెండు ట్రాక్టర్లు భీంపూర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా వాంకిడి మీదుగా తరలిస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ యాజమాని బామ్నె సురేందర్, భీంపూర్‌కు చెందిన ట్రాక్టర్ మేకర్తి హనుమంతు, డ్రైవర్ శ్రావణ్ కుమార్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

### దరఖాస్తు చేసుకోవాలి

లింగాపూర్: మండలంలోని గ్రామాలకు చెందిన వ్యక్తులు ఫారెస్ట్ పట్టా పొంది మృతిచెందితే కుటుంబ సభ్యులు తిరిగి పట్టా చేసుకోవడానికి దరఖాస్తులు అందించాలని డిప్యూటీ తహసీల్దార్ పెద్ది రాజు ఓ ప్రకటనలో తెలిపారు. మృతిచెందిన వారి డెత్ సర్టిఫికెట్, ఫారెస్ట్ పట్టా, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, మూడు పాస్‌ఫొటోలతోపాటు కుటుంబీకులకు సంబంధించి ధ్రువపత్రాలను జిరాక్స్ ప్రతులతో జతపర్చి దరఖాస్తులు అందించాలని సూచించారు.

# రైతుకు గుర్తింపు

- జిల్లాలో ప్రారంభమైన ఫార్మర్ రిజిస్ట్రీ
- 11 అంకెలతో ఫార్మర్ ఐడీ కేటాయింపు
- ఈనెల 31లోగా పూర్తిచేయాలని లక్ష్యం
- కార్డు ఆధారంగా సంక్షేమ పథకాలు వర్తింపు



కౌటాలలో రైతు రిజిస్ట్రీ నమోదు చేస్తున్న అధికారులు

కౌటాల: రైతు (ఫార్మర్) రిజిస్ట్రీ అమలు ప్రక్రియ ఇటీవల జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ ప్రారంభించింది. ఆధార్‌తో ప్రతీ రైతుకు 11 నంబర్లతో యూనిక్‌కోడ్ (యూసీ) కేటాయించాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో కేంద్రం రూపొందించిన ×ఫార్మర్ ఐడీ៖ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా 1.15 లక్షల మంది భూ యజమానులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయనున్నారు. వారికి ఉన్న భూమి రకం, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేయనుంది.

**రైతుకు డిజిటల్ కార్డు**

'ఫార్మర్ ఐడీ' ప్రాజెక్టు కింద అర్హులైన ప్రతీ రైతుకు 11 నంబర్ల యూనిక్ ఐడీ కేటాయిస్తున్నారు. ఇది వారికి అందించే డిజిటల్ గుర్తింపు కార్డు. ఆధార్‌తో లింక్ అయి ఉంటుంది. ఈ 11 అంకెల ఐడీలో రైతు పేరు, ఆధార్, మొబైల్ నంబర్, పట్టాదారు పాస్ బుక్ వివరాలు, భూమి రకం (ఎర్ర నేల, నల్ల నేల, తరి, మెట్ట) సర్వే నంబర్లు, సాగు చేసిన పంటలు తదితర సమాచారం నమోదు చేస్తారు. ఈ ఐడీ ద్వారా రైతు సాగు వివరాల చిట్టా అంతా ఒకే క్లిక్‌తో తెలుసుకోవచ్చు. కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్‌కార్డు, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఇది తప్పనిసరి కానుంది. ప్రస్తుతం భూ యజమానులకే మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూయజమానులు తప్పనిసరిగా ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కావాల్సిందే. కాగా, తమకు అవకాశం ఇవ్వలేదని కౌలు రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

**ప్రయోజనాలెన్నో..**

ప్రతీ రైతుకు జారీ చేసే యూనిక్ ఐడీకి ఆయా రైతులు సీజన్‌లో పొందే సబ్సిడీలు, రుణాలు, పంట బీమా వంటి పథకాలను అనుసంధానం చేస్తారు. ఇలా తయారైన ఫార్మర్ రిజిస్ట్రీని యూనిఫైడ్ ల్యాండ్ ఏపీఐ, ఆధార్ బేస్ట్ అథంటికేషన్, పీఎం కిసాన్ వంటి డిజిటల్ అగ్రికల్చర్ ప్లాట్‌ఫామ్స్‌కు సైతం అనుసంధానం చేస్తారు. ఈ ఐడీని ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంక్ లింకేజీతో కూడిన ఆర్థికసేవలను పొందవచ్చు. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు ఈ ఐడీ ఉపకరిస్తుంది. ఈ ఐడీ సాయంతో దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, రుణబకాయిలు, ప్రభుత్వ పథకాల జమ వంటి వివరాలను క్షణాల్లో తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఫార్మర్ ఐడీ ద్వారా కేంద్ర పథకాల ప్రయోజనాలు వేగంగా, పారదర్శకంగా అందుతాయి. ప్రకృతి విపత్తుల సమయంలో ఐడీ నంబర్ ఎంటర్ చేస్తే రైతు సాగు వివరాలు తెలుస్తాయి.

**ఏఈఓల వద్ద రిజిస్ట్రేషన్..**

రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్‌తో స్థానిక ఏఈవోను సంప్రదించాలి. అలాగే భూమి వివరాలు, సాగు చేసిన పంటల సమాచారాన్ని అందించాలి. ఈ వివరాలను వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. యాప్‌లో వివరాలు ఎంటర్ చేసిన తర్వాత రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ చేసిన తర్వాత రైతుకు 11 సంఖ్య ఫార్మర్ రిజిస్ట్రీ నెంబర్ జనరేట్ అవుతుంది. ఆ నంబర్‌తో కూడిన మెసేజ్ రైతు మొబైల్‌కు వెళ్లడంతో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. జిల్లాలోని ఏఈవోలు వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో ఈనెల 5 నుంచి రైతుల వద్దకు వెళ్లి యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేసి రిజిస్ట్రీ నెంబర్ కేటాయిస్తున్నారు. ఈనెల 31లోగా అర్హులైన రైతులందరికీ ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్‌ను జనరేట్ చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ అధికారులు పని చేస్తున్నారు. జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

**ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేస్తున్నాం**



కౌటాల మండలంలోని అన్ని వ్యవసాయ క్లస్టర్లలో ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్ నమోదు చేస్తున్నాం. అర్హులైన రైతులందరు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి. వారి సందేహాలు ఉంటే కౌటాల రైతు వేదికలో సంప్రదించాలి.

– ప్రేమలత, వ్యవసాయాధికారి, కౌటాల

## ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

కౌటాల: నాణ్యత ప్రమాణాలు పాటించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ఎంపీడీవో బి.రమేశ్ అన్నారు. మండలంలోని నాగేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని, ఇంటి నిర్మాణ పనుల ఫొటోలను యాప్‌తోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఏపీవో పూర్ణిమ, పంచాయతీ కార్యదర్శి సంధ్య, తదితరులు ఉన్నారు.

## ఆదివాసీలకే ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ఆర్కా గోవింద్

నార్నూర్: ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి ఏజెన్సీ చట్టాలను అనుసరించి ఆదివాసీలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా కొంతమంది గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరిగిందన్నారు. దీని వలన అర్హులైన ఆదివాసీలకు పథకం అందడం లేదన్నారు. 6 ఇళ్లు మాత్రమే గిరిజనులకు, 12 గిరిజనేతరులకు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్ అన్నారు. గురువారం గాదిగూడ మండల కేంద్రంలోని ఆర్యభట్ట పాఠశాల మైదానంలో భవిష్యత్ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఆదివాసీ విద్యార్థులను సన్మానించారు. ఉత్తమ మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ మోటివేషన్ స్పీకర్ తోడసం గోపాల్, రాయిసెంటర్ సార్‌మేడిలు జుగ్నక భీంరావు, మండడి దౌలత్ రావు, మాడవి భారత్, కొడప జాకు, రామారావు పాల్గొన్నారు.

### సన్మానం

తిర్యాణి: మండల కేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహించి సిర్పూర్(టి) బదిలీ అయిన హేమంత్‌ను గురువారం పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ సన్మానించారు. బ్యాంకు మేనేజర్ రవీందర్ సిబ్బంది ఉన్నారు.

## దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



వైద్యాధికారికి సమ్మె నోటీసులు అందజేస్తున్న ఏఎన్ఎంలు

రెబ్బెన: ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. గురువారం రెబ్బెన పీహెచ్‌సీలో వైద్యాధికారి సుజిత్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరినీ 510 జీవోలో నష్టపోయిన వారి కోసం కొత్త జీవో విడుదల చేసి వేతనాలు పెంచాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేసి ఎలాంటి షరతులు లేకుండా అందరిని రెగ్యులర్ చేయాలన్నారు. పీఆర్సీ, ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనంగా రూ. 26 వేలు చెల్లించాలని, రెండవ ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని కోరారు. ఏజెన్సీ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా ప్రతినెల 5లోగా వేతనాలు చెల్లించాలన్నారు. ఎన్‌హెచ్ఎం జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రమీల, సిబ్బంది తులసీ, వనిత, మండల్, నాయకులు అరికిల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుపై బుంగ



రెబ్బెన: మండల కేంద్రంలో చేపట్టిన నేషనల్ హైవే నిర్మాణంలో నాసిరకం పనులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. రోడ్డు పనులు పూర్తయి కనీసం రెండేళ్లు పూర్తికాకముందే సర్వీసు రోడ్డు లోపలికి కుంగిపోయి బుంగ ఏర్పడింది. రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లే ప్రజలు ఆదమర్చి అందులో కాలువేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గతం లోనూ సర్వీసు రోడ్డు వెంట సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు చేపడుతుండగానే పైకప్పు కూలిపోయింది. స్థానిక పీహెచ్‌సీ వద్ద సైతం డ్రైన్ పైకప్పుపై బుంగ ఏర్పడగా సిమెంట్ బిల్ల వేసి తాత్కాలికంగా మూసివేశారు. దాంతో నేషనల్ హైవే పనుల్లో నాణ్యతపై ప్రజలు మండిపడుతున్నారు.

### కనువిందు చేస్తున్న మే పుష్పాలు



**రెబ్బెన: ఒక్కో సీజన్‌లో ఒక్కో రకం పూలు పూస్తుంటాయి. కేవలం మే నెలలో మాత్రమే వికసించే మే పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. రెబ్బెన మండలం గోలేటి పంచాయతీలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పొన్నాల మేరీ ఇంటి ఆవరణలో చెట్టుకు ఒకేసారి 6 పుష్పాలు పూయడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.**



**బెజ్జూర్: మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో సరైన డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామంలో చెత్తాచెదారం రోడ్లపై వేయడంతో చిరు వర్షాలకు దుర్గంధం రావడంతో ముక్కుమూసుకుంటున్నారు. వర్షాలకు మట్టిరోడ్లు బురదమయంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.**

డ్రెయినేజీ లేక అవస్థలు

### భద్రతా చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: కశ్మీర్ ఘటన నేపథ్యంలో దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భద్రతా చర్యలు పాటించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఆయన ఏరియా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసుల సూచనల మేరకు గనులపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఉద్యోగులు డ్యూటీకి వచ్చే సమయంలో తప్పనిసరిగా ఐడీ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. అనుమానితులు గనులు, డిపార్టుమెంట్ల పరిసరాల్లో సంచరిస్తే వెంటనే సెక్యూరిటీ డిపార్టుమెంట్‌కు తెలియజేయాలన్నారు. గుర్తు తెలియని వారు ఏవైనా పార్సిల్స్ ఇస్తే తీసుకోవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనలను పాటించాలన్నారు. ఈ విషయాలను గనులపై కార్మికులకు తెలియజేయాలని మేనేజర్లకు సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) భీబత్సా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, ఏజెంట్లు కే రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, ఎస్ఈ చంద్రశేఖర్, ఎంవీటీసీ మేనేజర్ కే రామారావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బంది పెట్టకుండా పంట కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు ఇబ్బందులు లేకుండా జొన్న పంట కొనుగోలు చేయాలని రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డును పరిశీలించారు. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన జొన్న పంటను గ్రామాల వారీగా కొనుగోలు చేసే విధంగా ప్రణాళికతయారు చేయాలన్నారు. ఆదిలాబాద్, మావల, తలమడుగు మండలాల్లో జొన్న పంట 22,428 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 48,302 క్వింటాళ్ల జొన్న పంట కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అకాల వర్షం పడే అవకాశం ఉండడంతో రైతులకు గన్ని బ్యాగులు ఇచ్చి త్వరగా పంట కొనుగోలు చేయాలని కోరారు. ఆయన వెంట రైతులు నవీన్, ప్రవీణ్, రామకృష్ణ, రమేశ్, స్వామి పాల్గొన్నారు.

## పంట మార్పిడి పద్ధతి పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

బోథ్: రైతులు పంట మార్పిడి పాటించాలని శాస్త్రవేత్తలు ప్లాంట్ పాథాలజీ ప్రొఫెసర్ రాజేశ్వరి, అగ్రోనమీ ప్రొఫెసర్ మంజులత అన్నారు. గురువారం పట్నాపూర్ రైతువేదికలో వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో క్రిమిసంహార ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. జిల్లాలో సాగుచేసే ముఖ్యమైన పంటల్లో విత్తన శుద్ధి, సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అధిక సాంద్రతలో పత్తి సాగుపై రైతులతో చర్చించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి మాట్లాడుతూ వ్యవసాయంలో చేపట్టాల్సిన సాంకేతిక పద్ధతులు తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి రవితేజ, ఉద్యానవన అధికారి, వెటర్నరీ అసిస్టెంట్, డ్రీమ్స్ ఫౌండేషన్ తరపున ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

పాతమంచిర్యాల: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు ఫౌండర్ హెన్రీ డ్యూయంట్ జన్మదినాన్ని ప్రపంచ రెడ్‌క్రాస్ డేగా నిర్వహించడం జరుగుతుందని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేసి హెన్రీడ్యూయంట్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆనంద నిలయంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రదత్, సుగుణాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి చందూరీ మహేందర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, శంకర్ వర్మ, బుద్దార్థి సత్యనారాయణ, రక్తనిధి కేంద్రం సిబ్బంది మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

జన్నారం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న అన్నారు. ఎస్సీ ఎస్టీ టీఎఫ్ ఆధ్వర్యంలో ×ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర៖అనే అంశంపై నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నానాటికి విద్యార్థులు నమోదు తగ్గుతుందని, విద్యార్థులు తగ్గితే ఉపాధ్యాయుల భవిష్యత్, ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఉపాధ్యాయుడు తనవంతుగా కనీసం పదిమంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలే ముందున్నాయని, నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ బడులు మన అందరివని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. సమావేశంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన దుర్గం రాజలింగంను సన్మానించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, మండల అధ్యక్షుడు తుంగూరి గోపాల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర సహాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మంత్రి 'పొన్నం' జన్మదిన వేడుకలు



వేడుకల్లో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయం జిల్లా రవాణా అధికారి రామచందర్, ఎంవీఐలు మోహన్, రాజమల్లు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు దేవాజీ, మురళీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.